క్లుప్తంగా

జాతీయ రహదారి రూట్ మ్యాప్ మార్చాలని ఆందోళన



వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

రామకృష్ణాపూర్: లక్సెట్టిపేట నుంచి ముల క్లల మీదుగా క్యాతనపల్లి వరకు నూతనంగా నిర్మించే జాతీయ రహదారి నిర్మాణంతో విలువైన తమ భూములు కోల్పోతామని, రోడ్డు నిర్మాణానికి సంబంధించి రూపొందించిన రూట్‌మ్యాప్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ కుర్మపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు సోమవారం ఆందోళన చేపట్టారు. సర్వేకు వచ్చిన హైవే అధికారులతో పాటు మందమర్రి తహసీల్దార్ శ్రీనివాస్‌కు తమ సమస్యను విన్నవించారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే తమకు, భూమికి బదులు వేరే చోట భూమిని ఇవ్వాలని కోరారు. ప్రత్యామ్నాయం చూపే వరకు సర్వే ఆపేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ



మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి సహకారంతో సోమవారం ఆదిలాబాద్ రీజినల్ డిప్యూటీ మేనేజర్ సురేష్‌చౌహాన్ అర్హులైన వంద మంది దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. మంగళవారం కూడా బస్‌పాస్‌ల పంపిణీ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ దేవపాల, రెడ్‌క్రాస్ కమిటీసభ్యులు సత్యపాల్ రెడ్డి, ఆర్టీసీ ఉద్యోగులు రాజశేఖర్, నాగరాజ్, అశోక్, ప్రేమ్‌కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

నేడు బెల్లంపల్లిలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల సభ

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధుల సభ మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు తిరుమల హిల్స్‌లోని ఆర్‌పీ గార్డెన్స్‌లో సభ జరుగుతుందని తెలిపారు. ఈ సభకు మంచిర్యాల, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు, పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్, అనుబంధ కమిటీల అధ్యక్షులు విధిగా హాజరుకావాలని కోరారు.

తాండూర్ ఎస్సైగా రాజశేఖర్



తాండూర్: మండల కేంద్రంలో ఎస్సైగా పనిచేసిన బానోతు సమ్మయ్య రామగుండం కమిషనరేట్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో నెన్నెల ఎస్సైగా విధులు నిర్వర్తించిన ఎస్.రాజశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్సై రాజశేఖర్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఆవిర్భావ సభకు తరలిరండి

చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల మైదానంలో మంగళవారం ఉదయం 10గంటలకు బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ బాల్కసుమన్ తెలిపారు. పార్టీ జెండా ఆవిష్కరణ, అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్ర పటానికి పూల మాలల సమర్పణ, అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సభ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సభకు నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

'ప్రశ్నించే వారిని బెదిరించడం సరికాదు'

మందమర్రిరూరల్: నియోజకర్గంలో అభివృద్ధిపై ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను ప్రభుత్వ విప్ బాల్కసుమన్ తుపాకితో కాల్చుతానని బెదిరించడం సరికాదని మందమర్రి మండల బీజేపీ అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమన్ బహిరంగంగా కాల్చి చంపుతానని బెదిరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, వెంటనే ఆ మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు రంజిత్, ప్రేమ్ సాగర్, పవన్‌కుమార్, రాజేష్‌నాయక్, రవి, రమేష్ ఉన్నారు.

గ్రీవెన్స్‌కు స్పందన కరువు



భీమిని ప్రజావాణిలో పాల్గొన్న ట్రెయినీ కలెక్టర్ గౌతమి

భీమిని: కన్నెపల్లి, భీమిని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు కరువయ్యాయి. ప్రజావాణిలో ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు చెబుతున్నప్పటికీ, ప్రజలు సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రాలకు కాకుండా జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. దీంతో మండల కేంద్రాల్లో జరిగే ప్రజావాణికి వినతులు రావడం లేదు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్నారు. రాంపూర్, బిట్టూర్‌పల్లి, వీగాం గ్రామపంచాయతీల్లోని నర్సరీని ట్రెయినీ కలెక్టర్ గౌతమి పరిశీలించి, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమాల్లో ట్రెయినీ కలెక్టర్ గౌతమి, ఎంపీడీఓ రాధాకిషన్, డీఎల్‌పీఓ ఫణీందర్‌రావు, ఎంపీఓ సబ్దర్‌అలీ, సతీష్‌కుమార్, తహసీల్దార్ రాంచందర్, లక్ష్మీరాజయ్య, ఏపీఓ భాస్కర్‌రావు, శ్రీనివాస్ ఉన్నారు.

భీమారం: ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణికి మండల స్థాయి అధికారులు సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో రెవెన్యూశాఖకు సంబంధించిన దరఖాస్తును ఒక రైతు అందజేశారు. ప్రతి అధికారి ప్రజావాణికి హాజరైతే మంచి ఫలితాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఇందులో తహసీల్దార్ వాసంతితో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువయ్యింది. ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. ఇందులో మండల ప్రత్యేకాధికారి కృష్ణ, ఎంపీడీవో టి.శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి, ఏవో కవిత, ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఏఈపీఆర్ శివ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాసిపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో రెవెన్యూ శాఖకు సంబంధించి 3దరఖాస్తులు, ముత్యంపల్లి గ్రామపంచాయతీకి సంబంధించి 1 దరఖాస్తు మొత్తం నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో ఎంఏ అలీం తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నీలిమ, తహసీల్దార్ దిలీప్‌కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 4వినతులు వచ్చినట్లు ప్రత్యేకాధికారి ప్రకాశ్ తెలిపారు. పింఛన్లు అందించాలని ముగ్గురు మహిళలు, రోడ్డు నిర్మాణానికి అనుమతించాలని మరొకరు మొత్తం నలుగురు వినతిపత్రాలు అందించారన్నారు. వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు.



భీమారం ప్రజావాణిలో పాల్గొన్న ఎంపీడీవో



చెన్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో..



దండేపల్లి: వినతులు అందిస్తున్న అర్జీదారులు

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- ఎమ్మెల్యే దివాకర్‌రావు



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దండేపల్లి: కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. మండలంలోని కన్నెపల్లి, గూడెం, నంబాల, వెల్గనూర్, కాసిపేట, పెద్దపేట, పాత మామిడిపల్లి, కొత్తమామిడిపల్లి, లింగాపూర్, తాళ్లపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన వరి ధాన్యానికి మద్దతు ధర అందించడం కోసం ప్రభుత్వం రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని, పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలన్నారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల బ్రహ్మోత్సవం



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

లక్సెట్టిపేట: మండలంలోని చందారం గ్రామంలో శ్రీ ప్రసన్నాంజనేయ సీతారామ ఆలయం నిర్మించి నేటికి పన్నెండు సంవత్సరాలు పూర్తి కావడంతో పుష్కర ప్రయుక్త బ్రహ్మోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆరు రోజులుగా కార్యక్రమాలు కొనసాగిస్తుండగా సోమవారం అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆగమరావు గిరిజ, కిషన్‌రావు వినోద్, వంగపెల్లి పూర్ణచందర్‌రావు, ఎంపీపీ మంగ, చిన్నన్న, అనుమండ్ల వేణు, రవీందర్‌రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కొమ్మల పేరిట చెట్లను నరికేస్తున్నారు..!



మంచిర్యాలటౌన్: రాష్ట్రం ఏర్పడిన తరువాత హరిత హారం పేరిట పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఏటా మొక్కలను నాటుతుంటే, విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డు వస్తున్నాయని చెట్లను సగానికి నరికేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కాలనీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఇంటికి సమీపంలోని మూడు చెట్లను సగానికి పైగా నరికేశారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను మాత్రమే నరకాల్సి ఉన్నా, చెట్లనే నరికేయడం, ఎమ్మెల్యే నివాసం సమీపంలోనే చెట్లను నరకడం, హరితహారం లక్ష్యాన్ని విస్మరించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ర్యాలీగా వెళ్తున్న సీపీఎం నాయకులు

జన్నారం: పేదల సమస్యలపై పాలకులకు పట్టింపు లేదని, ఇలాంటి సమస్యలు ఉన్న కాలనీల్లో పాలకులు ఉంటారా అని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి ప్రశ్నించారు. మండలంలోని పొనకల్, బుడుగజంగాల కాలనీ, సుందరయ్య కాలనీల్లో నెలకొన్న సమస్యలపై సోమవారం పాదయాత్రగా ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నా, పాలకులు పట్టింపు లేకుండా ఉండటం సరికాదన్నారు. అధికారులు పర్యటించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీసీ రోడ్లు వేయించాలని, నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పనులు కల్పించి, పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అశోక్, నాయకులు లింగన్న, జయ, బుచ్చన్న, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



స్వీట్లు తినిపిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓలు



భీమిని ఎంపీడీఓ కార్యాలయంలో..

భీమిని: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం భీమిని, కన్నెపల్లి మండలాల్లో పంచాయతీ అధికారులు ఘనంగా జరుపుకున్నారు. ట్రెయినీ కలెక్టర్, భీమిని ఇన్‌చార్జి ఎంపీడీఓ గౌతమి పంచాయతీ అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో డీఎల్‌పీఓ ఫణీందర్‌రావు, ఎంపీడీఓ రాధాకిషన్, ఎంపీఓ సబ్దర్‌అలీ, సతీష్, ఏపీఓ భాస్కర్‌రావు, శ్రీనివాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఎంపీడీఓ లక్ష్మయ్య, తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను గ్రామాల్లో అందుబాటులోకి తేవడం కోసం పంచాయతీ రాజ్ శాఖ కృషి చేస్తుందని తెలియజేశారు. పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రతి గ్రామపంచాయతీ ఆదర్శంగా నిలువాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ బాపురావు, ఏపీఓ సత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టుకార్డు ద్వారా సీఎంవోకు సమస్యలు



పోస్టుకార్డులు చూపుతున్న కార్యదర్శులు

నెన్నెల: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యదర్శులు తమ సమ్మెలో భాగంగా సోమవారం పోస్టు కార్డు ద్వారా సీఎంఓకు తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులను మూడేళ్లలో రెగ్యులర్ చేస్తామని నోటిఫికేషన్‌లో ఇచ్చి నాలుగేళ్లు పూర్తయినా రెగ్యులర్ చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.

అన్నదాత అయోమయం..!



అంకూసాపూర్‌లో వరిపైరు దుస్థితి

భీమారం: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు భయంభయంగా గడుపుతున్నారు. భీమారం మండలంలో యాసంగి పంట నాట్లు ఆలస్యం కావడంతో వరికోతలు ఇంకా మొదలు కాలేదు. మరో పది రోజుల్లో పంట కోసేందుకు రైతన్న సిద్ధమవుతుండగా పంట చేతికచ్చే సమయంలో వర్షాలు పడుతుండడంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. నాలుగు రోజుల క్రితం ఈదురు గాలులతో కొన్నిచోట్ల వరిపైరు నేలవాలగా, మరోసారి వర్షం పడితే ఆ వరి పనికిరాకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మామిడి పరిస్థితి అంతే..

ఇటీవల వీచిన గాలులకు మామిడి తోటల్లోని కాయలు నేలరాలాయి. దీంతో మామిడికాయల ధర విపరీతంగా పడిపోయింది.

పదోన్నతిపై వెళ్తున్న అధికారికి సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కే 1ఏ గనిలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఎస్ఓటూ జీఎంగా పదోన్నతిపై వెళ్తున్న అధికారి శ్రీధర్‌రావును సోమవారం కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. జ్ఞాపికను అందజేశారు. మేనేజర్‌గా గనిలో శ్రీధర్‌రావు అందించిన సేవలను కొనియాడారు. మున్ముందు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అక్బర్‌అలీ, పిట్ కార్యదర్శులు సురమల్ల వినయ్, బండారి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



భీమారంలో బతుకమ్మతో నిరసన



బెల్లంపల్లిరూరల్: ఒంటి కాళ్లపై నిలబడి



వేమనపల్లిలో...

కొనసాగుతున్న వీఓఏల నిరసన

భీమారం/వేమనపల్లి/బెల్లంపల్లిరూరల్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి/మందమర్రిరూరల్: ఐకేపీ కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట వీఓఏలు వినూత్నంగా నిరసన తెలిపారు. భీమారంలో బతుకమ్మ ఆడి నిరసన తెలపగా, వేమనపల్లి, బెల్లంపల్లిలో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. వీలైనంత త్వరగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. బెల్లంపల్లిలో సోమగూడెం సర్పంచ్ ప్రమీలతో పాటు పలువురు నాయకులు, మందమర్రిలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రామిళ్ల రాధిక, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంవీ గుణ, నాయకురాళ్లు మద్దెల భవాని, బొడ్డు వినోద సంఘీభావం తెలిపారు. దండేపల్లిలో సోమవారం జరిగిన శ్రీ లక్ష్మీ మండల సమాఖ్య సమావేశాన్ని గ్రామ సంఘం లీడర్లు బహిష్కరించారు. మండల సమాఖ్య కార్యాలయం నుంచి వీవోఏల దీక్ష శిబిరం వరకు ర్యాలీగా వచ్చి మద్దతు తెలిపారు. దీక్షలో కూర్చున్న వారికి ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించేందుకు చల్లని మజ్జిగా అందించారు.



దండేపల్లి: మద్దతు తెలుపుతున్న వీవో లీడర్లు



మందమర్రిలో...



హాజీపూర్‌లో...

'నాపై వచ్చిన ఆరోపణలు అన్నీ అవాస్తవమే'



మాట్లాడుతున్న కౌన్సిలర్ బేర సత్యనారాయణ

నస్పూర్: తనపై కొందరు వ్యక్తులు చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవేమనని బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మాజీ ఎంపీపీ బేర సత్యనారాయణ తెలిపారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన జల్పుల రవి, బత్తుల శ్రీనివాస్, కామిడి రాజిరెడ్డి అనే వ్యక్తులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేశం అనే వ్యక్తి తీగల్‌పహడ్ శివారు సర్వే నంబరు 42/2/ఆ లోని భూమి వివాదంలో నాపై, నా అనుచరులపై అసత్యపు ఆరోపణలు చేస్తూ మమ్మల్ని బదనాం చేస్తున్నారని ఆరోపించారు. సదరు సర్వే నంబరులోని సుమారు 9గుంటల భూమిని నాతో పాటు, మరో ముగ్గురం కలిసి గతంలో కొనుగోలు చేసి 13నవంబర్ 2022లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. రాజేశం అనే వ్యక్తి ఇప్పుడు ఆ స్థలం నాది అని అంటున్నాడని, నేను నా జీవితంలో ఎవరి వద్ద నుంచి ఒక్క సెంటు భూమిని కూడా అన్యాయంగా ఆక్రమించుకోలేదని స్పష్టం చేశారు. ఈ నెల 30వ తేదీన ఇదే వేదిక వద్ద అందుబాటులో ఉంటానని, నేను ఎక్కడైనా భూ ఆక్రమణకు పాల్పడినట్లు ఎవరి వద్దనైనా ఆధారాలు ఉంటే వాటిని తీసుకురావాలని ఆయన సవాలు విసిరారు. భూ ఆక్రమణకు పాల్పడినట్లు నిరూపిస్తే, నేను వారికి ఆ భూమిని అప్పగించి క్షమాపణ చెప్పి, ఊరు వదిలి వెళ్లిపోతానని పేర్కొన్నారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక, కొందరు వ్యక్తులు తనపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

అంగన్‌వాడీలో వార్షికోత్సవ వేడుకలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు ఆటల, పాటల పోటీలు నిర్వహించిన అనంతరం వారికి బహుమతులు అందించారు. ఏడాదిలో చిన్నారులు చూపించిన ప్రతిభను తెలిపే కార్డులను అంగన్‌వాడీ టీచర్ రేణుక అందజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

తాండూర్: అనారోగ్య సమస్యలతో ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న బోయపల్లి ఎంపీటీసీ సభ్యురాలు, శ్రీ బుగ్గ రాజరాజేశ్వరస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీదేవిని సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బోయపల్లి గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

నేడు న్యాయ సలహా కేంద్రం ప్రారంభం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట రైతువేదికలో మంగళవారం న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి మార్గం రజిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల కోర్టు న్యాయమూర్తుల చేతుల మీదుగా న్యాయ సలహా కేంద్రం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

వాసవీమాత పారాయణం

జన్నారం: మండల కేంద్రంలోని పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలో ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం ఇంటింటా వాసవీమాత పారాయణం కొనసాగుతుంది. ఈ నెల 30వరకు పారాయణం చేయనున్నట్లు వాసవి సేవాదళ్ సభ్యుడు చంద్రశేఖర్ తెలిపారు.

మెరిట్ టెస్ట్‌లో అర్చన విజయకేతనం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మాటేటి అర్చన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ టెస్ట్‌లో విజయం సాధించింది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొమ్మ గణపతిరెడ్డి చేతుల మీదుగా విద్యార్థినికి రూ.12వేల నగదు ప్రోత్సాహకం అందజేశారు.

హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

మందమర్రిరూరల్: రాష్ట్రంలో హమాలీల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మందమర్రి మార్కెట్‌లోని హమాలీల సంఘం ఆఫీస్‌లో సోమవారం ఈ నెల 29న నిర్వహించే 'చలో లేబర్ కమిషనర్ ఆఫీస్ (హైదరాబాద్)' పోస్టర్ ఆవిష్కరించారు.

అధికారికి సన్మానం

నస్పూర్: ఈ నెల రిటైర్డ్ కాబోతున్న శ్రీరాంపూర్ ఎస్ఓటూ జీఎం త్యాగరాజన్‌కు సీసీసీ సింగరేణి ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు శాలువా కప్పి సన్మానించారు.

బండి సంజయ్‌ను కలిసిన జిల్లా నేతలు

బెల్లంపల్లి: జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శులు సోమవారం ఆ పార్టీ రాష్ట్ర చీఫ్, ఎంపీ బండి సంజయ్‌ను కలిశారు. కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శులు రమేష్, రజనీష్ జైన్, శ్రీనివాస్ కలుసుకుని స్థానిక అంశాలపై చర్చించారు.